క్లుప్తంగా

స్మృతివనం పనుల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేస్తున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని ఈ నెల 26వ తేదీ రాజ్యాంగ దినోత్సవం రోజున సీఎం వైఎస్ జగన్ ప్రారంభిస్తారని మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి తెలిపారు. స్మృతివనం నిర్మాణ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. పర్యటనలో వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సంకట హర చతుర్థి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గణపతికి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చన నిర్వహించారు. మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో గణపతి ఉత్సవమూర్తికి ఆలయ అర్చకులు పంచామృత అభిషేకాలు జరిపారు. అనంతరం స్వామి వారికి అర్చనలు, విశేష అలంకరణ చేసి, గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలను చేపట్టారు. స్వామి వారి అభిషేకాలు, అర్చనలో పలువురు ఉభయదాతలు, భక్తులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న ఉభయ దాతలకు ప్రత్యేక క్యూ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

వైద్యాధికారి పోస్ట్‌కు నేడు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం ద్వారా రవాణాశాఖ రాష్ట్ర కార్యాలయంలో పని చేసేందుకు వైద్యాధికారి నియామకానికి గురువారం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని బుధవారం తెలిపారు. పాత ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. నెలకు రూ.50 వేల వేతనం ఇస్తామన్నారు. ఇంటర్వ్యూకు వచ్చే వారు 10వ తరగతి, ఇంటర్మీడియెట్, ఎంబీబీఎస్, నివాస ధ్రువపత్రం నకలు కాపీలతో హాజరు కావాలని సూచించారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ బీమా పథకం కింద ద్వారా పేదలకు ఆర్థిక భరోసా కలుగుతుందని 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో నివసిస్తున్న స్వర్ణం అంజలి బుధవారం మృతి చెందిన క్రమంలో మట్టి ఖర్చుల నిమిత్తం వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన రూ.10 వేలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తుందని చెప్పారు. మిగిలిన సొమ్మును నామినీ బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు ముత్తా వాసు, సీహెచ్ లక్ష్మణ్, ముత్యాల రాంబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్టోబర్ 17 నుంచి 21వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో తమ విద్యార్థులు మంచి రేటింగ్ సాధించారని శ్రీగౌతమ్ స్కూల్ కరస్పాండెంట్ నల్లాని సూర్యారావు తెలిపారు. స్కూల్ ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఫిడే రేటింగ్ సాధించిన విద్యార్థులను అభినందించారు. 8వ తరగతి విద్యార్థి పిల్లా దుర్గా ప్రసాద్ 1,208, 6వ తరగతి విద్యార్థి గంటా చైతన్యలు 1,119 రేటింగ్‌ను సాధించారన్నారు. చెస్ టోర్నీలో రాణించిన విద్యార్థులను, కోచ్ అవ్వారు రామకృష్ణను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపాల్ పి.తులసీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'సాక్షి' మ్యాథ్స్‌బీ పరీక్ష

- 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహణ
- నాలుగు కేటగిరీల్లో విద్యార్థులకు పరీక్షలు
- విద్యార్థుల నుంచి విశేష స్పందన
- విజయవాడ నగరంతో పాటు జిల్లాలోని పలు స్కూళ్లలో నిర్వహణ



కేసీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



సెయింట్ జాన్స్ స్కూల్‌లో ..

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సాక్షి మీడియా గ్రూపు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మ్యాథ్స్‌బీ పరీక్ష ఉత్సాహంగా జరిగింది. మ్యాథ్స్‌బీ పరీక్ష విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టింది. మ్యాథ్స్‌లో విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి వారిలో సబ్జెక్ట్‌పై మక్కువ పెంచడానికి విద్యార్థులకు ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులు వారు చదువుతున్న తరగతిని బట్టి నాలుగు కేటగిరీలుగా విభజించి ఈ పరీక్షను నిర్వహించారు. పాఠశాల స్థాయిలో జరిగిన ఈ పరీక్షకు విజయవాడ నగరంలోని ప్రైవేట్ పాఠశాలలతో పాటు నగర పరిసర ప్రాంతాల్లో స్కూళ్లకు చెందిన విద్యార్థులు ఈ పరీక్షలో ఉత్సాహంగా పాల్గొని వారిలోని ప్రతిభను ప్రదర్శించారు. లెక్కల సబ్జెక్ట్ అంటే తమకు 'లెక్క' లేదని నిరూపించారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి జిల్లా, రీజనల్, రాష్ట్ర స్థాయిలో పరీక్షను నిర్వహిస్తారు.

మ్యాథ్స్‌బీ పరీక్ష జరిగిన పాఠశాలలు

కానూరులోని కేసీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో-96 మంది, డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో-387 మంది, భవానీపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో-108 మంది, బందరురోడ్డులో సెయింట్ జాన్స్ స్కూల్‌లో 53 మంది, మొగల్రాజపురంలోని వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో 99 మంది, కానూరులో షామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 118 మంది, సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో 103 మంది, ఆగిరిపల్లిలోని హ్యాపీ వ్యాలీ స్కూల్‌లో 81 మంది, పోరంకిలోని సంవిధ విద్యాపీఠ్‌లో 38 మంది, 5వ నంబరు బస్సు రూట్‌లోని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో 107 మంది, గాయత్రినగర్‌లోని నలంద విద్యానికేతన్‌లో-85 మంది, నలందా హైస్కూల్‌లో 14 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

లెక్కలంటే భయం తగ్గింది



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్ బీ పరీక్షలో పాల్గొనడంతో లెక్కలంటే ఉన్న భయం తగ్గింది. ఈ పరీక్షకు ప్రిపేర్ కావడానికి చాలా సాధన చేశాను. ఈ సాధనలో భాగంగా పరీక్షకు ఎలా ప్రిపేర్ అవ్వాలనే అంశంపై పట్టు సాధించాను.

–భవ్యశ్రీ, 6వ తరగతి, సెయింట్ జాన్స్ స్కూల్, సత్యనారాయణపురం

సబ్జెక్ట్‌పై పట్టు దొరికింది



లెక్కల సబ్జెక్ట్‌పై ఆసక్తి పెరిగింది. సులువుగా లెక్కలను ఏవిధంగా చేయవచ్చు అనే అంశంపై ఈ పరీక్ష ద్వారా అవగాహన వచ్చింది. లెక్కలపై సబ్జెక్ట్‌పై మరింత సాధన అవసరమని తెలిసింది. మ్యాథ్స్‌బీ పరీక్ష ద్వారా చాలా మెలకువ తెలుసుకున్నాను.

–చిత్ర, వీపీ సిద్ధార్థ స్కూల్, 3వ తరగతి, విజయవాడ

కనకదుర్గానగర్‌లో దుకాణాల తరలింపునకు రంగం సిద్ధం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి అభివృద్ధి పనులకు శంకుస్థాపన నేపథ్యంలో కనకదుర్గానగర్‌లోని దుకాణాల తరలింపునకు రంగం సిద్ధమైంది. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అన్నదాన భవనం, లడ్డూ పోటు, క్యూ కాంప్లెక్స్‌తో పాటు మరి కొన్ని అభివృద్ధి పనులకు ఈ నెల మూడో వారంలో శంకుస్థాపన చేయనున్నారు. అభివృద్ధి పనులు శరవేగంగా చేపట్టేందుకు కనకదుర్గానగర్ చాలా కీలకంగా మారింది. ఈ క్రమంలో అక్కడ ఉన్న దుకాణాలను ఖాళీ చేయించాలని దేవస్థానం నిర్ణయించింది. కనకదుర్గానగర్‌లోని దేవస్థానానికి చెందిన స్థలంలో రెండేళ్ల కిందట 24 షాపులను నిర్మించారు. మహామండపం 5వ అంతస్తులో ఉన్న దుకాణాలకు చెందిన వారితో పాటు మొత్తం 21 మందికి షాపులను కేటాయించింది. ఈ మేరకు షాపు యజమానులతో దేవస్థాన అధికారులు మంగళవారం సమావేశమయ్యారు. ప్రస్తుతం కనకదుర్గనగర్‌లో ఉన్న దుకాణాలను తొలగించినట్లయితే తమకు మరో చోట ప్రత్యామ్నాయం చూపాలని దుకాణదారులు కోరుతున్నారు. దీంతో ఆయా దుకాణాల యజమానులకు ఎక్కడ షాపులు కేటాయించాలనే దానిపై దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టత రావాల్సి ఉంది. త్వరలోనే షాపు యజమానులు, దేవస్థాన అధికారులతో సమావేశం నిర్వహించి, తగిన నిర్ణయం తీసుకుంటామని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో వైద్య విప్లవం



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి



మెడికల్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

- వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన
- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజలకు ఉన్నత స్థాయి వైద్యాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో వైద్యరంగంలో ఒక విప్లవమని, తద్వారా ప్రజల ఆరోగ్యానికి గొప్ప భరోసాను ఇస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. విద్యాధరపురం లేబర్‌కాలనీలోని వీఎంసీ కల్యాణమండపంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడారు. ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2.25 లక్షల బీపీ కేసులను కొత్తగా కనుగొన్నామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించుకునే గొప్ప అవకాశం ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లక్షలాది మంది ప్రాణాలను నిలబెట్టారని వెలంపల్లి గుర్తు చేశారు. ఆయన అడుగు జాడల్లోనే నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళుతున్నారని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశంలోని అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, పార్టీ నాయకులు పెద్ది రాజారావు, ఏజీఎల్ నారాయణ, శర్మ, కారంపూడి రఘు, రామలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలి..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురం 42వ డివిజన్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. వైద్య శిబిరాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నా వారికి కిట్లు అందజేశారు. నగర మేయర్ రాయన బాగ్యలక్ష్మి, కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శిబిరాలకు అద్భుత స్పందన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి అద్భుత స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పాతబస్తీలోని 37వ డివిజన్ పరిధిలోని దళవాయి సుబ్బరామయ్య వీఎంసీ హైస్కూల్, 51 డివిజన్‌లోని కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో బుధవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. శిబిరాలను స్థానిక శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ భాగ్యలక్ష్మీతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయా శిబిరాల్లో వైద్య సేవలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు పొందిన స్థానిక ప్రజలకు మందులను అందించారు. వైద్య సేవల వివరాలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం 37వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన పెన్షన్లను ఆయా లబ్ధిదారులకు అందించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రజల ప్రాణాలకు అండగా ఉంటున్నాయన్నారు. నగర వ్యాప్తంగా విస్తృతంగా ఈ శిబిరాలు కొనసాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రుహుల్లా, ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, మండేపూడి ఛటర్జీ, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతలకు సత్కారం



అవార్డు గ్రహీతలను సత్కరించిన విజయబాబు, కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పవిత్రమైన వృత్తిని, ప్రవృత్తిని సమన్వయం చేసుకుంటూ సుదీర్ఘ కాలం జర్నలిస్టులుగా, రచనల్లో రాణించిన వారు వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందుకోవడం ఆనందించదగ్గ విషయమని రాష్ట్ర అధికార భాషా సంఘ కమిషన్ చైర్మన్ పి.విజయబాబు తెలిపారు. వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందుకున్న జర్నలిస్టులు, రచయితలను విజయవాడ మొగల్రాజపురంలోని సీఆర్ మీడియా అకాడమీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీతలు గోవిందరాజు చక్రధర్, మహమ్మద్ ఖదీర్ బాబు, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, టి.శివాజీ, కె.హనుమంతరెడ్డి, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డిలను సత్కరించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ దశాబ్దాల కిందట నుంచి పాత్రికేయ వృత్తిలో, రచనా వ్యాసంగంలో ప్రతిష్టులైన వారిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గుర్తించి గౌరవించడం అభినందనీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిభకు పట్టం కట్టడం రాష్ట్ర ప్రభుత్వం గొప్పతనమన్నారు. సీఆర్. మీడియా అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాల గంగాధర తిలక్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు వీవీఆర్ కృష్ణంరాజు, నిమ్మరాజు చలపతిరావు, పి.రామకృష్ణ, బడే ప్రభాకరరావు పాల్గొన్నారు.

2024 తరువాత టీడీపీ జెండా పీకేయటం ఖాయం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 2024 అసెంబ్లీ ఎన్నికల తరువాత తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సైతం జెండా పీకేయటం ఖాయమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన చంద్రబాబు బెయిల్, ఆ పార్టీ చేసిన ర్యాలీ తదితర అంశాలపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణాలో తెలుగుదేశం పార్టీ జెండా పీకేసిందన్నారు. అదే తరహాలో ఇక్కడ సైతం జెండా పీకేయటానికి సిద్ధంగా ఉందన్నారు. చంద్రబాబుకి ఒళ్ళు అంతా రోగాలు ఉన్నాయని మానవతా దృక్పథంతో కోర్టు బెయిల్ ఇచ్చిందన్నారు. ఆయన కళ్లకు ఆపరేషన్ చేయించుకోవాలని కోరితే నాలుగు వారాలు బెయిల్ మంజూరు చేశారని, బెయిల్ గడువు ముగియగానే ఆయనను లోపల వేయడం ఖాయమన్నారు. టీడీపీ వాళ్లవి తాత్కాలిక సంబరాలు మాత్రమేనన్నారు. తండ్రి జైలులో ఉంటే ఢిల్లీలో వెళ్లి కూర్చున్న లోకేష్ ఇప్పటి దాకా యుద్ధం చేయలేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు యుద్ధం చేస్తానని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. చంద్రబాబు నిజం మాట్లాడితే ఆయన తల వెయ్యి ముక్కలవుతుందని ముని శాపముందన్నారు. అందువలనే ఆయన నిన్న బయటకు రాగానే అన్ని అబద్ధాలే మాట్లాడారని చెప్పారు.

తెలుగు వారి మనోభావాలను దెబ్బతీసిన వ్యక్తి చంద్రబాబు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, అవినాష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను అర్పించిన పొట్టి శ్రీరాములును నిర్లక్ష్యం చేయటం ద్వారా యావత్ తెలుగు వారి మనోభావాలను చంద్రబాబు దెబ్బతీశారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విజయవాడ నగరపాలకసంస్థ కార్యాలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌లు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం అవతరణకు తన ప్రాణాలు అర్పించిన మహా నేత పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. గతంలో చంద్రబాబునాయుడు ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పూర్తిగా మరచిపోయారన్నారు. పొట్టి శ్రీరాములు అవమాన పరిచిన వ్యక్తి చంద్రబాబు అని దుయ్యబట్టారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నేడు జగనన్న ప్రభుత్వంలో అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. శ్రీరాములు ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని చెప్పారు. ఆర్యవైశ్య మహాసభ నాయకులు పెనుగొండ సుబ్బారాయుడు, కొనకళ్ల విద్యాధరరావు, సంఘం నగర అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ, కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర, సాధు సత్యనారాయణ, దింటకుర్తి రాఘవ, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం



మాట్లాడుతున్న వీఎంసీ అదనపు కమిషనర్ శకుంతల, అధికారులు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీ టీకే రాణా



మాట్లాడుతున్న రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

పటమట(విజయవాడతూర్పు): ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం ఎనలేనిదని వీఎంసీ అడిషనల్ కమిషనర్(జనరల్) కె.శకుంతల అన్నారు. బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయాలను గుర్తు చేసుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందని పేర్కొన్నారు అన్నారు. అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.సత్యవతి మాట్లాడుతూ.. దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందిందని, భాషా ప్రయత్నం ఏర్పాటు చేయాలన్న అమరజీవి పొట్టి శ్రీరాములు ఆలోచన ఎంతో గొప్పదన్నారు, కార్యక్రమంలో పట్టణ సాధికార విభాగం అధికారి రోహిణి, మేనేజర్ బి.శ్రీనివాసరావు, వివిధ శాఖాధిపతులు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ ఆశయాల కోసం కృషి చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ కమీషనరేట్‌లో సీపీ టీకే రాణా బుధవారం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి, సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్రం కోసం బలిదానం చేసుకున్న గొప్ప త్యాగమూర్తి అని కొనియాడారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, అటువంటి మహనీయుడిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం పోలీస్ సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఎస్‌బీ ఏడీసీపీ సీహెచ్ లక్ష్మీపతి, ఏసీపీ కేవీవీఎన్వీ ప్రసాద్, సీసీఆర్‌బీ ఏసీపీ వెంకటేశ్వరరావు, ఏఓ రంగారావు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే పోలీసుల ఆధ్వర్యంలో..

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని బుధవారం విజయవాడ రైల్వే పోలీసులు ఘనంగా నిర్వహించారు. రైల్వే ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేశారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రైల్వే డీఎస్పీ నాగరాజు రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ యు.బంగారు రాజు, జీఆర్పీ సీఐ పి.శ్రీనివాస్, ప్రసాద్, సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయడని ఆర్యవైశ్య సేవా సంఘం (గొల్లపూడి) సభ్యుడు పి.గంగాధర్ అన్నారు. గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 52 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి చివరకు ప్రాణాన్ని సైతం త్యాగం చేసి అశువులు బాసిన నిస్వార్థ సేవకుడు పొట్టి శ్రీరాములని కొనియాడారు. పాఠశాల కరస్పాండెంట్ ఆర్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు.

అడ్వకేట్‌కు బెదిరింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అడ్వకేట్‌ను రోడ్డుపై అడ్డగించి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట రామాలయం ప్రాంతానికి చెందిన సింగంపల్లి శివకుమార్ అడ్వకేట్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లుతున్న శివకుమార్‌ను సింగంపల్లి దుర్గారావు అనే వ్యక్తి అడ్డగించి నోటికి వచ్చినట్లు దూషించడమే కాకుండా చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. గతంలో దుర్గారావుపై అతని వదిన కిరణ్‌కుమారి అత్యాచారం కేసు పెట్టింది. ఈ కేసు శివకుమార్ పెట్టించాడనే అపోహతో బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహితను బెదిరిస్తున్న వారిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను బెదిరిస్తున్న ఇద్దరిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నంబర్ 84లో భూపతి జయలక్ష్మి, లక్ష్మీప్రసన్నకుమార్ దంపతులు నివాసం ఉంటున్నారు. జయలక్ష్మి నివాసం ఉంటున్న ఇంటిని అంజిరెడ్డి అనే వ్యక్తి విక్రయించాడు. అయితే ఆ ఇంటిని మురళీకృష్ణ, వసంత అనే దంపతులు కొనుగోలు చేసేందుకు మాట్లాడుకున్నారు. అదే సమయంలో జయలక్ష్మి దంపతులు ఆ ఇంటిని కొనుగోలు చేశారు. దీన్ని మనసులో పెట్టుకుని జయలక్ష్మిని ఇష్టానుసారంగా దూషించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెంగట్టు కొండ ప్రాంతానికి చెందిన యాట్ల పరమేశ్వరి, నాగరాజు భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తె ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుకుంది. రెండు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో ఇంటి వద్దే ఉంటుంది. బుధవారం ఉదయం పనికి వెళ్లిన పరమేశ్వరికి ఆమె ఇంటి సమీపంలోని బంధువులు ఫోన్ చేసి ఇంట్లో కుమార్తె లేదని చెప్పారు. దీంతో ఇంటికి వచ్చిన పరమేశ్వరి చుట్టు పక్కల ఆరా తీసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.